క్లుప్తంగా

కావడి మొక్కులు తీర్చుకున్న చైర్మన్



కావడి మోస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కావడి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో ఊరేగింపుగా కావడి మోస్తూ పట్టణంలో విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.

బీమా తక్షణ సాయం అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్తువ రత్తూరు దళితవాడకు చెందిన గురవయ్య (45) కుటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయాన్ని అందజేశారు. గురవయ్య అనరోగ్యంతో మృతి చెందడంతో భార్య చెంగమ్మకు రూ.10 వేలు తక్షణ సాయాన్ని బుధవారం సర్పంచ్ సుప్రియ, గ్రామ కార్యదర్శి శివకుమార్ అందజేశారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ మునికృష్ణయ్యను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. అధ్యాపకులు సత్యనారాయణ, నాగయ్య,రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయవాది ప్రజ్ఞశ్రీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై న్యాయవాదులు అవగాహన కల్పించారు. న్యాయవాది ప్రజ్ఞశ్రీ మాట్లాడుతూ ఆకతాయిలతో విద్యార్థినులు జాగ్రత్తగా మసలు కోవాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉంటే ఎలాంటి సమస్యలనైనా సులభంగా ఎదుర్కొనవచ్చని తెలిపారు. న్యాయవాది గరకిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన



స్వామి, అమ్మవార్లకు లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు రోడ్డులోని యోగిమల్లవరంలో ఉన్న శ్రీకామాక్ష్యాంబ సమేత శ్రీపరాశరేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం లక్ష బిల్వార్చనను శాస్త్రోక్తకంగా నిర్వహించారు. శ్రావణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు జరిగాయి. ఉదయం 7 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు లక్ష బిల్వాలతో స్వామివారికి అర్చన చేశారు. బుధవారం పౌర్ణమి సందర్భంగా మహాన్యాస రుద్రాభిషేకం, పూర్ణాహుతి కలశాభిషేకంతో ఉత్సవాలు ముగియనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

తిరుచ్చిపై వేణుగోపాలుని విహారం



కార్వేటినగరం: మండలకేంద్రంలోని వేణుగోపాల ఆలయంలో తెపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెండవ రోజు మంగళవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను పట్టు వస్త్ర, సుగంధర భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం స్వామివారు పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

వరాల తెలుగు..జగమంత వెలుగు



బీఎన్‌కండ్రిగ: తెలుగు అక్షర ఆకృతిలో మానవహారం



పాపానాయుడుపేట : బహుమతులు అందజేస్తున్న డీవైఈఓ ఆనంద్‌రెడ్డి



బీఎన్‌కండ్రిగ : కల్లివెట్టులో విద్యార్థులకు బహుమతులు



బీఎన్‌కండ్రిగ: తెలుగుతల్లి వేషధారణ

సత్యవేడు: తెలుగు భాషకు తొలి అడుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని ప్రభుత్వ బాలికల, కళాశాల ప్రిన్సిపల్ వి.వాణి అన్నారు. మంగళవారం పాఠశాల, కళాశాల విద్యార్థులు తెలుగు భాషదినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ నినాదాలు చేశారు. కళాశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు డీవీ రాజు, ఢిల్లీ రాణి, ప్రసాద్, పరందాం, విమల, దుర్గాప్రసన్న పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి పట్టణంలో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పదనం, గిడుగు రామమూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. తెలుగు భాష మాధుర్యాన్ని విద్యార్థులకు వివరించారు. ది స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, అధ్యాపకులు పద్మప్రియ తదితరులు పాల్గొన్నారు. శ్రీచైతన్య, భాష్యం, నారాయణ పాఠశాలల్లో కూడా తెలుగు భాషా భాషదినోత్సవం నిర్వహించారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని పాఠశాలలో తెలుగు భాష, క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఉమ, ఏర్పేడు, పల్లం, బండారుపల్లె, పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాపానాయుడుపేట ఉన్నత పాఠశాలలో తిరుపతి డివిజన్ ఉప విద్యా శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

పుదుకుప్పం తమిళ పాఠశాలలో..

సత్యవేడు: పుదుకుప్పం తమిళ మీడియం హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు గేయాలు ఆలపించారు. హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు జయంతి, ప్రేమ్ కుమార్, ఆంథోని, ఏకాంబరం, శివలింగం, పీఈటీ కె.గ్రేస్ ప్రతిమ పాల్గొన్నారు.

తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటుదాం

బుచ్చినాయుడుకండ్రిగ: దేశ భాషలందు లెస్సగా కీర్తి అందుకున్న తెలుగుభాషా ఔన్నత్యాన్ని చాటుదామని, తెలుగు భాషా సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం అన్నారు. మండలంలోని కల్లివెట్టు, బీఎస్‌కండ్రిగ, నెలవాయి, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తెలుగు భాష తల్లితో సమానమని తెలిపారు. భాషా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. బీఎస్‌కండ్రిగలో తెలుగు అక్షర ఆకృతిలో విద్యార్థులు మానవహారంగా నిలబడి భాషాభిమానాన్ని చాటుకున్నారు

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: మండలంలోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో హాజరైయ్యారు. గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించి, తెలుగు భాష గొప్పతనాన్ని ఉపాధ్యాయులు వివరించారు. సాయంత్రం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద జరిగిన కార్యక్రమానికి ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు, టీచర్లు సంప్రదాయ వస్త్రధారణతో విచ్చేశారు.

నాగలాపురంలో..

నాగలాపురం : మండలంలోని పాఠశాలమమ్మ తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. మండల కేంద్రంలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.



సత్యవేదులో విద్యార్థినుల ర్యాలీ



సత్యవేదు: పుదుకుప్పంలో..



పిచ్చాటూరు : కీళపూడి పాఠశాలలో..



పిచ్చాటూరు : సంప్రదాయ వస్త్రధారణ



పాపానాయుడుపేట కళాశాలలో..



ఏర్పేడు ఉన్నత పాఠశాలలో..



శ్రీకాళహస్తి: వివిధ వేషధారణల్లో..



నాగలాపురంలో ర్యాలీ

రూ.2లక్షల వెండి గిన్నెల వితరణ



వెండి గిన్నెలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన లక్కిరెడ్డి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు రూ.2 లక్షలు విలువ చేసే వెండి వస్తువులను అందజేశారు. వీటిని ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి, స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి సేవలో మంత్రి నాగార్జున

శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం మంత్రి మేరుగ నాగార్జున దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి, వేదపండితులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేవారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు.



మంత్రి నాగార్జునకు జ్ఞాపిక అందజేస్తున్న పవిత్రారెడ్డి

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయ ఆవరణలో నాబార్డు సౌజన్యంతో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై సత్యకృష్ణ బృందం ఆధ్వర్యంలో బుధవారం కళాజాత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ హరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డిజిటల్, నగదు రహిత, లావాదేవీలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సహకార బ్యాంకు ద్వారా వ్యవసాయ, బంగారు ఆభరణాలు, గృహ, వ్యాపార రుణాలు విరివిరిగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బాంకు పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేనేజరు సాయిరాజశేఖర్, సిబ్బంది రమేష్, మహేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తలారివెట్టు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఐటీడీఏ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమర హాస్పిటల్, తిరుపతి, ఎంజీఎం హాస్పిటల్ శ్రీకాళహస్తి వైద్య సిబ్బంది శిబిరంలో 80 మందికిపైగా వైద్య పరీక్షలు చేశారు. గుండె, కిడ్నీ, యూరాలజీ, సాధారణ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఐదుగురిని వివిధ ఆపరేషన్లకు రెఫర్ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే ఆదిమూలంతో మాట్లాడుతున్న గ్రామస్తులు

నారాయణవనం: మండల కేంద్రంలోని శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని దర్శించారు. ఈసందర్భంగా మండలంలోని అనుబంధ ఆలయాల అభివృద్ధికి టీటీడీ పాలక మండలిపై ఒత్తిడి తీసుకురావాలని స్థానికులు ఎమ్మెల్యేను కలసి విన్నవించారు. ఎమ్మెల్యే ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ టీటీడీ అధికారి నాగరాజు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పునఃనిర్మాణానికి ఏడాది కిందట టీటీడీ ఇంజనీరింగ్ విభాగం రూ 7.5 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. టీటీడీ పాలక మండలి అనుమతించాల్సి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరభద్ర ఆలయంతో పాటు కల్యాణ మండపం మరమ్మతులు, ఆధునీకరణకు టీటీడీ చైర్మన్‌తో చర్చించి, అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శివశంకర్, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ అణ్ణాదొరై, కైలాసకోన బోర్డు మెంబర్ ఢిల్లీ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సర్వే తనిఖీ



పాయ్య గ్రామంలో జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం పాయ్య, సింగమాల గ్రామాల్లో ఓటర్ల సవరణ జాబితా సర్వేను కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. డబుల్ ఎంట్రీ, మృతి చెందిన ఓటర్ల తొలగింపును పరిశీలించారు. జాబితా పక్కాగా తయారు చేయాలని బీఎల్వోలను ఆదేశించారు. ఆర్డీవో రామారావు, తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో శిక్షణకు దరఖాస్తులు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణులు, ఏదైనా డిగ్రీ పొందిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో సెప్టెంబర్ 7వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 63009 54441 నంబర్‌లో సంప్రదించాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.

నయనానందకరంగా పల్లకీ సేవ



పల్లకీలో విహరిస్తున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం సాయంత్రం పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు నయనానందకరంగా సాగింది ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలను పూర్తి చేశారు. ఉత్సవర్లకు స్నపన తి రుమంజనం నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ అమ్మవారి సహా వీరభద్ర స్వామిని సర్వాంగ సుంద రంగా అలంకించి పల్లకిలో కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి ధూప, దీప నైవేద్యాల ను సమర్పించారు. సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

వైభవంగా శ్రవణ నక్షత్ర పూజలు



స్వామి,అమ్మవార్ల ఊరేగింపు

నాగలాపురం : మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీదేవి, భూదేవి సమేత వేద నారాయణస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

వేడుకగా గంగమ్మ జాతర



గంగమ్మ తల్లిని దర్శించుకుంటున్న పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట గణేష్‌నగర్‌లో వెలసిన గ్రామ దేవత గంగమ్మతల్లి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు సుఖ,శాంతులతో ఉండాలని ఆమె వేడుకున్నారు. సీసీరోడ్లు, కాలువల సమస్య ఉందని స్థానికులు ఆమెకు విన్నవించగా, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, జువ్వల దయాకర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాల పెంపు



అమృత్ సరోవర్‌ను పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీలో చేపట్టిన అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెంపొందుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి డిప్యూటీ కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని బండారుపల్లెలో ఉపాధిహామీ కింద తవ్విన అమృత్ సరోవర్‌ను పరిశీలించారు. ఏళ్ల తరబడి నీళ్లులేని తామరగుంటలో ఉపాధిహామీలో పూడికతీత పనులు చేపట్టారని గ్రామస్తులు వివరించారు. ఈ పనులతో తామర గుంటలో నీళ్ల చేరాయని చెప్పారు. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగినట్లు పేర్కొన్నారు. అమృత్ సరోవర్ కట్ట చుట్టూ గ్రావెల్‌తో వాకింగ్ ట్రాక్, క్రొటాన్, పూల మొక్కలు, గడ్డిమొక్కలు పెంచడంతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉందన్నారు. సేద తీరడానికి అక్కడక్కడ బల్లలు వేసినట్లు చెప్పారు. వృద్ధులు, విద్యార్థులు, గ్రామస్తులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడానికి చాలా అనువుగా ఉన్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు అమృత్ సరోవర్ ప్రాముఖ్యతను వివరించడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ సరిత, ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, పట్టాభిరెడ్డి, క్షేత్ర సహాయకుడు వెంకటేష్, కూలీలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నందకిషోర్

వరదయ్యపాళెం: ఆటలతో మానసిక వికాసం సాధ్యమని మండలానికి చెందిన ఎన్ఆర్ఐ ప్రతినిధి నందకిషోర్ అన్నారు. మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఎన్ఆర్ఐ నందకిషోర్ రూ. 60వేలు విలువజేసే ప్లేట్లు, క్రీడా సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పీడీ బందిల కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి





మోహన్‌బాబు మృతదేహం, మోహన్‌బాబు (ఫైల్)

ఏర్పేడు: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నంపల్లిలో సోమవారం రాత్రి చోటుకుంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం.. వడమాలపేట మండలం, కల్లూరు దళితవాడకు చెందిన ముళ్లపూడి మోహన్‌బాబు(45), ఏర్పేడు మండలం, చెన్నంపల్లి గ్రామానికి చెందిన మునిరెడ్డి(46) స్నేహితులు. మునిరెడ్డిని భార్య వదిలేయగా.. వారి కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని వెళ్లింది. ప్రస్తుతం మునిరెడ్డి చెన్నంపల్లిలో ఒంటరిగా జీవిస్తున్నాడు. మోహన్‌బాబు అప్పుడప్పుడూ చెన్నంపల్లికి వచ్చి తన స్నేహితుడు మునిరెడ్డితో కలిసి మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో సోమవారం మునిరెడ్డి ఇంటికి వెళ్లిన మోహన్‌బాబు అక్కడే రాత్రి వరకు మద్యం సేవించాడు. ఆపై మంగళవారం ఉదయం మంచంపై ఉలుకుపలుకూ లేకుండా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే మోహన్‌బాబు మృతిచెంది ఉన్నాడు. పంచనామ నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని శరీరంపై ఎలాంటి గాయాలు లేవని సీఐ చెప్పారు. మునిరెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

